# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

APRIL 2006

సంవత్సర చందా రూ. 50/-

## క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

### సత్యవాణి టి.వి.కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు
'మా' టి.వి. లోను

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్ లోను చూడండి

ప్రతి గురువారం : SITI కేబుల్ & IN కేబుల్‌లో ఉదయం
(కాకినాడలో మాత్రమే) 7:00 గం॥లకు, సాయంత్రం 5:30 గం॥లకు

ప్రసంగీకులు : బ్రదర్, జాషువా గూటం
బ్రదర్. రిక్కీ గూటం

**సత్యసువార్తను వినండి !!**

**మీ బంధు మిత్రులకు విన్పించండి !!**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.O.Box-80, Kakinada, A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 26 ఏప్రిల్ 2006 సంచిక 8


# నశించినదానిని వెదుకుట
## (Seeking the Lost)

నేను బొంబాయి నగరంలో యుంటున్నపుడు ఒక సంగతి జరిగింది. సముద్రములో పడి మునిగిపోవుచున్న ఒక మనిషిని యౌవనస్థుడు ఒకడు తక్షణమే సముద్రములోనికి దుమికి రక్షించుట జరిగినది. అతడు మునిగిపోవుచుండగా అనేకులు చూచుచున్నను, ఒక్క యౌవనస్థుడు మాత్రమే అతనిని రక్షించుటకు ముందుకు వెళ్ళెను. ఒక పవిత్రప్రాణము నాశనము కాకుండ ఈ యౌవనస్థుడు చేసిన ఈ క్రియ గొప్ప ధైర్యసాహసములు గల క్రియ యని వార్తాపత్రికలలో ప్రచురించబడెను. ఈ యౌవనస్థుని యొక్క ధైర్యసాహసములను గూర్చి మనము చదువునప్పుడు గాని వినునప్పుడుగాని, మన హృదయాలలో ప్రగాఢమైన సంతోషము ఉద్భవించును.

అయితే ఇంతకన్నా గంభీరమైనట్టి ఆశ్చర్యకరమైనట్టియు రక్షణ బైబిలు నందు మనకున్నది - పాపము అను మహా సముద్రములో పడి మునిగిపోవుచున్న స్త్రీ పురుషుల యొక్క రక్షణ అందులో మనకున్నది. నశించినదానిని వెదకి రక్షించుటకు వచ్చిన మనుష్యకుమారుని గూర్చి క్రొత్త నిబంధన బోధించుచున్నది.

లూకా వ్రాసిన సువార్త 19వ అధ్యాయములో ఒక చక్కని సంగతిని గూర్చి వ్రాయబడినది. అది యేసుక్రీస్తు ఈ లోకములో యుండగా జరిగిన ఒక సంఘటన. ఆయన తన కరుణను ఒక వింతయైనవానిపై చూపించుట ఆనాడు జరిగినది. ఆతడు సుంకపు గుత్తదారుడు: జక్కయ్య పొట్టివాడు అయినను యేసుని చూడగోరెను. "అప్పుడు యేసు ఆ త్రోవను రానైయుండెను గనుక అతడు ముందుగా పరుగెత్తి అయనను చూచుటకు ఒక మేడిచెట్టు ఎక్కెను. యేసు ఆ చోటికి వచ్చినప్పుడు కన్నులెత్తి చూచి - జక్కయ్యా, త్వరగా దిగుము, నేడు నేను నీయింట నుండవలసియున్నదని అతనితో చెప్పెను. అతడు త్వరగా దిగి సంతోషముతో ఆయనను చేర్చుకొనెను. అందరు అది చూచి - ఈయన పాపియైన మనుష్యుని యొద్ద బసచేయ వెళ్ళెనని చాల సణుగుకొనిరి. జక్కయ్య నిలువబడి - ఇదిగో ప్రభువా, నా ఆస్తిలో సగము బీదల కిచ్చుచున్నాను ; నేనెవరి యొద్దనైనను అన్యాయముగా దేనినైనను తీసుకొనిన యెడల అతనికి నాలుగంతలు మరల చెల్లింతునని ప్రభువుతో చెప్పెను. అందుకు యేసు ఇతడును అబ్రహాము కుమారుడే ; ఎందుకనగా నేడు ఈ యింటికి రక్షణ వచ్చియున్నది. నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను" (లూకా 19:1-10). పాపియైన ఒక మనుష్యుని ఇంటిలో యేసు ప్రభువు తాను ఈ లోకమునకు ఎందుకు వచ్చినదీ తెలియజేసెను - నశించిన దానిని వెదకి రక్షించుటకు ఆయన ఈ లోకమునకు వచ్చెను.

మానవజాతి అంతయును నశించిపోవుచున్నది. అది దేవుని గృహము నుండి, సత్యనిధులలో నుండి, పరిశుద్ధ మార్గముల నుండి, ఆనంద జలముల నుండి తొలగిపోయి నాశనమై పోవుచున్నది. ఐతే యీలాగున నాశనమైపోవుచున్న మానవులను రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు

వచ్చెను. త్రోవ తప్పి తొలగిపోయి, నాశనమగుట కన్నా ఘోరమైన దుస్థితి ఈ లోకములో వేరొకటి లేదు. సముద్రము మధ్యలో దిక్కుచిని కోల్పోయి నాశనమగుచు, మునిగిపోవడానికి సిద్ధముగా నున్న ఓడను ఒక్కమారు ఆలోచించుము. లేదా ప్రయాణము చేయుచూ దట్టమైన అడవులలో త్రోవ తప్పిపోయి, క్రూరమృగముల భయముతో నాశనమునకు పోవుచున్న ప్రయాణీకుని గమనించుము. పెద్ద పెద్ద పట్టణములలో క్రొత్త మనుష్యలను మోసగించువారి వలన, తప్పుత్రోవ లోనికి మరల్చబడిన యాత్రికుని గమనించుము. ఈ లోకములో మనము ఇట్టి అనేక సందర్భములను గమనించవచ్చును. తగిన సమయములో సహాయము అందలేకపోవుటచే నాశనమైనవారనేకులు ఉన్నారు. అయితే యేసుప్రభువు ఆత్మీయకముగా నాశనమై పోవుచున్న వారిని వెదకి రక్షించుటకు ఈ లోకమునకు వచ్చెను. పరలోకపు చరిత్రలో ఒక దినము ఉన్నది - ఆ దినమున, దేవుడు సృజించిన లోకము పాపకూపమున కూలిపోయినదని ప్రకటన చేయబడెను; దేవుని స్వరూపమందు, దేవుని పోలిక చొప్పున చేయబడిన మానవజాతి నాశనములో పడెనని ప్రకటించబడెను; వారు దేవుని సత్యమును, జ్ఞానమును విడనాడి, తమ పరలోక గృహమును విడనాడి, పాపమునందును, కల్మషమునందును తిరుగులాడుటకు నిశ్చయించుకొనిరి యని ప్రకటింపబడిన దినము అది. ఆదాము, హవ్వలు ఏదేనులో పాపము చేసిన దినము అది.

సృష్టికర్తయైన దేవుని సహవాసము నుండి తొలగింపబడిన మానవుని దుస్థితిని దేవుడు ఎరిగియున్నాడు. దేవుడు లేకుండా మానవుడు ఆత్మీయ అంధకారములో మునిగియున్నాడు. అవిశ్వాసము వలన అతడు అంతకంతకు అధోగతికి పాలై పోవుచున్నాడు. అయితే ఈ పాపపు లోకము నుండి మానవుని విమోచించుటకు దేవుడొక మార్గమును ఏర్పాటుచేసెను. అందువలన ఆయన తన అద్వితీయ కుమారుని ఈ లోకమునకు పంపెను. ఆయన మనలను వెదకి రక్షించు నిమిత్తము యేసును దేవుడు ఈ లోకమునకు పంపెను. పాపపు సముద్రములో పడికొట్టుకొను చుండగా మనలను వెదకి రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను.

ఆయన ఈ లోకమునకు ఎందుకు వచ్చెనో ఆయనే తన బోధ ద్వారాను, క్రియల ద్వారాను మనకు అనేకరీతులుగ తెలియపరచెను. వంద గొర్రెలు కలిగి, వానిలో ఒక్కదానిని పోగొట్టుకొనిన

గొర్రెల కాపరిని గూర్చి ఆయన మనకు బోధించెను. ఆయన ఇట్లనుచున్నాడు : "మీలో ఏ మనుష్యునికైనను నూరుగొర్రెలు కలిగియుండగా వీటిలో ఒకటి తప్పిపోయిన యెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి, తప్పిపోయినది దొరకువరకు దానిని వెదక వెళ్ళడా? అది దొరికినప్పుడు సంతోషముతో దానిని తన భుజముల మీద వేసికొని యింటికి వచ్చి తన స్నేహితులను పొరుగువారిని పిలిచి - మీరు నాతోకూడ సంతోషించుడి; తప్పిపోయిన నా గొర్రె దొరికినదని వారితో చెప్పును గదా. అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది నీతిమంతుల విషయమై కలుగు సంతోషము కంటే మారుమనస్సు పొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును" (లూకా. 15:3-7).

ఆయన బోధించుచూ మరియొక ఉపమానము చెప్పెను : "ఏ స్త్రీకైనను పది వెండి నాణెములుండగా వాటిలో ఒక నాణెము పోగొట్టుకుంటే ఆమె దీపము వెలిగించి యిల్లు ఊడ్చి అది దొరుకువరకు జాగ్రత్తగా వెదకదా? అది దొరికినప్పుడు తన చెలికత్తెలను పొరుగువారిని పిలిచి - నాతో కూడ సంతోషించుడి, నేను పోగొట్టుకొనిన నాణెము దొరికినదని వారితో చెప్పును గదా. అటువలె మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతల యెదుట సంతోషము కలుగునని మీతో చెప్పుచున్నాననెను" (లూకా. 15:8-10).

వంద గొర్రెలలో తప్పిపోయిన ఒక్క గొర్రెను వెదుకుచూ వెళ్ళిన గొర్రెల కాపరివలెను, పోగొట్టుకొనిన వెండి నాణెమును జాగ్రత్తగా వెదకిన స్త్రీవలెను, పాపములో పడిపోయిన వారిని వెదకి రక్షించుటకు యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెను. తప్పిపోయిన గొర్రెను అడవులలో వెదకుచూవెళ్ళిన గొర్రెల కాపరియొక్క ప్రేమ ఎంత గొప్పదో అట్లే పరలోకము నుండి మనలను వెదుకుచూ వచ్చిన యేసుక్రీస్తు యొక్క ప్రేమ అంతగొప్పది. గొర్రె యొక్క క్షేమము నిమిత్తము, ఆయన దానిని కనుగొనువరకు దానిని వెదుకుచూ వెళ్ళెను. పోగొట్టుకొనబడిన వెండినాణెమును ఒక స్త్రీ జాగ్రత్తగా వెదుకుటలో, దేవుని యెదుట ప్రతి ఆత్మకు ఉన్న విలువ బహుగొప్పది యని అర్థమగుచున్నది. యేసు బోధించిన ఈ గొప్ప ఉపమానములలో మన హృదయములను కరగించునంత ప్రేమ అందు కన్పడుచున్నది. మనలో ఏ ఒక్కడు నశింపవలెనని ఆయన

ఇష్టపడుటలేదు. ఆయన నీతిని బట్టి నశించుచున్న మనలను వెదకి రక్షించుటకు ఆయన ఈ లోకమునకు వచ్చెను.

యేసుక్రీస్తు పాపిని ప్రేమించి, పాపమును ద్వేషించెను. స్వనీతిపరులైన పరిసయ్యులు, శాస్త్రులు - ఆయన పాపుల యొద్ద బసచేయుటకు వెళ్ళెనని సణుగుకొనిరి. ఒకసారి భోజనమునకు యేసు కూర్చుండియుండగా "ఇదిగో, సుంకరులును, పాపులును అనేకులు ఆయన యొద్దను, ఆయన శిష్యుల యొద్దను కూర్చుండిరి. పరిసయ్యులు అది చూచి - మీ బోధకుడు సుంకరులతోను, పాపులతోను కలిసి యెందుకు భోజనము చేయుచున్నాడని ఆయన శిష్యుల నడిగిరి. ఆయన ఆమాట విని - రోగులకేగాని ఆరోగ్యము గలవారికి వైద్యుడక్కరలేదు గదా. అయితే నేను పాపులను పిలవ వచ్చితిని గాని నీతిమంతులను పిలువ రాలేదు" అని ఆయన చెప్పెను (మత్తయి 9:10-13). అవును, నిజమే. ఆత్మీయ వైద్యుడైన యేసుక్రీస్తు పాపపు రోగము నుండి మనలను విడుదల చేయుటకు వచ్చియున్నాడు. ఆయన గ్రుడ్డివారికి చూపు నిచ్చెను, కుంటివారికి నడువశక్తినిచ్చెను, కుష్టురోగులను స్వస్థపరచెను, చెవిటివారికి వినుటకు శక్తినిచ్చెను, చనిపోయినవారిని లేవదీసెను, దయ్యములను వెళ్ళగొట్టెను, పాపములను క్షమించెను. నిశ్చయముగా ఆయన పాపులను వెదకవచ్చెను.

చివరగా కాలము పరిపూర్ణ మయినప్పుడు మనందరి పాపప్రాయశ్చిత్తార్ధ బలిగా తన్నుతాను సిలువలో అర్పించుకొనెను, పాపములో బడి నశించుచున్న మనము ఆయన యందు రక్షింపబడగలుగునట్లు మన నిమిత్తము ఆయన మరణించెను. మనము విమోచింపబడ గలుగునట్లును, మనలను నిత్యమూ ప్రేమించుచున్న దేవుని దొడ్డిలో మనలను తిరిగి చేర్చగలుగునట్లును ఆయన మన నిమిత్తము బలియాయెను. దేవుడే మనలను కనుగొనుట ఆశ్చర్యకరము కదా? మనము దేవుని వెదుకుట మనకే మేలు కాదా? ఆయన ఎల్లప్పుడు నశించువారిని వెదుకుచూ యున్నాడు గనుక, మనము ఆయనను నిజముగా వెదకిన యెడల ఆయన తప్పక మనకు దొరకును.

యేసుక్రీస్తు నీకొరకు ఇంకను వెదకుచునే యున్నాడు. నాయొద్దకు ఈనాడే రమ్ము అని నిన్ను పిలుచుచున్నాడు. నీ హృదయపు తలుపునొద్ద ఆయన నిలబడి తట్టుచున్నాడు. నీ కొరకు ఆయన

ఈనాడు కనిపెట్టుచున్నాడు. నీ హృదయమును తెరచి ఆయనను లోపలికి రమ్మని ఈనాడే పిలువగలవా ? యేసుక్రీస్తు నందు విశ్వాసముంచి, నీ పాపముల నిమిత్తమై మారుమనస్సు పొంది, ఆయనయెడల నీకున్న విశ్వాసమును ఒప్పుకొని, నీ పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుట ద్వారా నీవు ఆయనను నీ హృదయములోనికి ఆహ్వానించగలవు. నీవు అట్లు చేసినయెడల ఈ పాపపు లోకము నుండి ఆయన నిన్ను రక్షించును అప్పుడు నీవు ఆయనవాడవు, ఆయన నీవాడును అగును. ఆయనను ఈనాడే అంగీకరించవా ?

# సంఘములో స్త్రీల పని
## (The work of Women in the Church)

క్రీస్తు సంఘము ప్రారంబింప బడిననాటినుండి సంఘములో పురుషులకు స్త్రీలకు సరిపడినంత పనిని దేవుడు కల్పించి యున్నాడు. క్రైస్తవ యుగారంభములో పురుషులు స్త్రీలు సువార్తను విని అనేక సంఖ్యలలో సువార్తకు లోబడినట్టు మనము చూడగలము. కొన్ని సందర్భములలో ఆయా ప్రదేశములలో స్త్రీలు క్రీస్తు సువార్తకు మొదట లోబడినట్లు మనము చదువగలము. మాసిదోనియలోను ఫిలిప్పయిలో స్త్రీలే మొదట సువార్తకు లోబడినట్లు మనము కనుగొనగలము. అపొ.కా. 16 : 13-15 లో లూదియ అను భక్తి గల స్త్రీయు, ఆమె కుటుంబ సభ్యులును క్రీస్తు సువార్తకు లోబడినట్లు మనము చదువ గలము. మనకు తెలిసినంత మట్టుకు ఆమె యింటిలో అప్పటికి ఉన్నవారందరు స్త్రీలేయని గ్రహింపవుచున్నది. ప్రభువు పనిలో తమ్మును తాము సమర్పించుకొని సేవచేయు స్త్రీల నిజమైన విలువను మనము తెలిసికొనుట కష్టము. భక్తి గల స్త్రీలు చేయు దేవుని పనియొక్క ఫలితము

నంతయు బహుశ పరలోకములోనే మనము తెలిసికొనగలము.

అయితే సంఘములో స్త్రీలు చేయవలసిన పనులేవిటో చేయకూడనివేవిటో దేవుని గ్రంథమునుండి ఈరోజు మనము తెలిసికొనుటకు ప్రయత్నము చేయుదము. సంఘములో స్త్రీల పనిని గూర్చి ఈనాడు ఎక్కువ ఆందోళన చెలరేగుచున్నట్లున్నది. గనుక ఈ అంశమును గూర్చిన సత్యమును తెలిసికొనుటకు ప్రయత్నించెదము. ప్రతి స్త్రీ కూడ దేవుని గూర్చి ఆయన గ్రంథమునుగూర్చి మరీముఖ్యముగ స్త్రీలనుగూర్చి ఆగ్రంథము ఏమి చెప్పుచున్నదో దానిని తెలిసికొనుటకు ప్రయత్నించవలెను.

స్త్రీల యొక్క పనిపై దేవుడు ఏర్పరచిన పరిమితిని గూర్చి మనము ఆశ్చర్యపడనవుసరము లేదు. యెహోవా దేవుని సేవకులందరిపైనను కొన్ని పరిమితులుండుట బైబిలులో మనము చూడగలము. యేసుక్రీస్తుకూడ ఇట్లు చెప్పెను. "నా యిష్టమును నెరవేర్చుకొనుటకు నేను రాలేదు; నన్ను పంపినవాని చిత్తము నెరవేర్చుటకు పరలోకము నుండి దిగి వచ్చితిని" (యోహాను 6 : 38). దేవుని చిత్తమునకు యేసు క్రీస్తు సంపూర్తిగలోబడెను. అందువలన ఆయన హెచ్చింపబడెనేగాని తగ్గింపబడలేదు పాత నిబంధనలోని ప్రవక్తలు, మరియు అపొస్తలులు, సువార్తికులు మొదలైనవారు దేవుని చిత్తమునకు సంపూర్తిగ లోబడి యుండిరి. అందువలన వారు ఏమాత్రము తక్కువ చేయబడినవారు కాదు.

"ప్రతి పురుషునికి శిరస్సు క్రీస్తనియు, స్త్రీకి శిరస్సు పురుషుడనియు, క్రీస్తుకు శిరస్సు దేవుడనియు మీరు తెలిసికొనవలెనని కోరుచున్నాను"అని అపొ. పౌలు 2 కొరింథి 11 : 3 లో వ్రాసెను. దేవునికి క్రీస్తు లోబడియున్నాడనుటలో ఆయన త్రిత్వమైన దేవునిలో తక్కువవాడని యర్థయుకాదు. పురుషుడు క్రీస్తుకు లోబడియుండుటవలన సృష్టిలో అతడు హీనమైనవాడని యర్థముకాదు. అదే రీతిగ పురుషునికి స్త్రీలోబడి యుండుటలో ఆమె పురుషునికంటె హీనమైన వ్యక్తియని అర్థము కాదు. హీనతకు విధేయతకు ఎంతో వ్యత్యాసమున్నది.

బైబిలుచేయు బోధప్రకారము స్త్రీలు సంఘములో పెద్దలుగా యుండలేరు. క్రొత్తనిబంధనలో అధ్యక్షుడు, పెద్ద, కాపరి అను పదములు ఒకే పనిని సూచించు పర్యాయపదముగా వినియోగించబడినవి. అధ్యక్షుడగువాడు ఏక పత్నీ పురుషుడై యుండవలెనని 2 తిమో 3:2 లో వ్రాయబడినది. అతడు తన పిల్లలను స్వాధీన పరచుకొనుచు తన యింటివారిని బాగుగా ఏలువాడై యుండవలెను. అధ్యక్షునిగూర్చి చెప్పునపుడెల్లా పుంలింగ నామవాచకమే వాడబడెను గాని స్త్రీలింగ నామవాచకము వాడబడలేదు. మానవులెన్ని రీతులుగా ప్రయత్నించినను పురుషుని పాత్రను స్త్రీ వహించలేదు. భర్త యొక్క పనిని స్త్రీ ఎన్నడు చేయలేదు.

సంఘములో స్త్రీ బోధకురాలిగా పని చేయలేదు. "స్త్రీలు మౌనముగా ఉండి సంపూర్ణ విధేయతతో నేర్చుకొనవలెను. స్త్రీ మౌనముగా ఉండవలసినదేగాని ఉపదేశించుటకైనను, పురుషునిమీద అధికారము చేయుటకైనను ఆమెకు సెలవియ్యను" అని 1 తిమోతి 2 : 12,13లో అపో పౌలు వ్రాసెను. కొరింధులోని సంఘమునకు వ్రాయుచు అతడు మరల ఇట్లు చెప్పెను : "స్త్రీలు సంఘములలో మౌనముగా ఉండవలెను; వారు లోబడి యుండవలసినదే గాని మాటలాడుటకు వారికి సెలవులేదు. ఈలాగు ధర్మశాస్త్రమును చెప్పుచున్నది. వారు ఏమైనను నేర్చుకొన గోరినయెడల ఇంట తమ తమ భర్తల నడుగవలెను; సంఘములో స్త్రీ మాటలాడుట అవమానము" (1 కొరింధీ 14 :34, 35). సువార్తికుడు బోధించుచు హెచ్చరించుచు సంపూర్ణాధి కారముతో దుర్బోధను ఖండించవలెనని తీతు 2 : 15 లో వ్రాయబడియున్నది. స్త్రీలపై దేవుడు నియమించిన పరిమితి దృష్ట్యావారు సంఘములో ఆ పనిని చేయలేరని మనము ఇట్టే గృహించుకొనగలము.

స్త్రీ ఒక యింటి యజమాని కాజాలదు. గృహ యజమాన్యమును పరిశుద్ధాత్ముడు పురుషునికే అప్పగించెను. అయితే ఏదైనా యింటిలో స్త్రీయే యజమానివలె ప్రవర్తించుట చాల విచారకరమైన సంగతి. దేవుడు తనకు అప్పగించని పని చేయుటకు భక్తిగల స్త్రీలలో ఏఒక్కరూ పూనుకొనరు.

అయితే స్త్రీలు చేయగలిగిన దేమిటి ? అనే ప్రశ్న మనకు యిప్పుడు సహజముగా వచ్చును. నిజానికి స్త్రీ చేయగలిగినది, అందులోను క్రైస్తవ స్త్రీ చేయగలిగినది ఎంతైనా యున్నది. ఆమె యౌవన కాలమందే యేసునుగూర్చి తెలిసికొని ఆయన సువార్తకు లోబడవచ్చును. తరువాత దేవుని వాక్యమును పఠించుచు క్రైస్తవ సద్గుణముల నలవరచుకొని తన జీవితములో ఆత్మఫలములను ఫలింపవచ్చును. ప్రేమ సంతోషము, సమాధానము దీర్ఘ శాంతము దయాళుత్వము మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము, మొదలగునవి ఆత్మఫలములని గలతీ 5 : 22 లో వ్రాయబడియున్నది. ఆమె క్రైస్తవ స్త్రీకి తగినట్టుగా పవిత్రమైన జీవితమును జీవించుచు, మంచిక్రైస్తవ పురుషుని పెండ్లిచేసికొని చక్కని భార్యవలెను, తల్లివలెను తయారు కావచ్చును. ఆమె తన భర్తకు నమ్మకమైన సాటియైన సహాయము కాగలదు. ఆమె తన భర్తకు దొరికిన గొప్ప మేలై యుండును. "భార్య దొరికిన వానికి మేలు దొరకెను. అట్టివాడు యెహోవా వలన అనుగ్రహము పొందినవాడు." "సుబుద్ధిగల భార్య యెహోవా యొక్క దానము" అని బైబిలు చెప్పుచున్నది (సామెతలు 18 : 22 ; 19 : 14). ఆమె బైబిలులో సామెతలు 31వ అధ్యాయములో వర్ణించబడిన రీతిగ ఘనత పొందతగిన ఆధునిక స్త్రీ కాగలదు (సామెతలు 31 : 10-31). ఆమె తన భర్తకు లోబడియుండి, భర్తను, పిల్లలను ప్రేమించుచు విశ్వాస ప్రేమ సహనములయందు లోపములేని స్త్రీవలె యుండవలెను. (తీతు 2 : 1-5). "యౌవన స్త్రీలు వివాహము చేసికొని పిల్లలను కని గృహపరిపాలన జరిగించుచు నిందించుటకు విరోధికి అవకాశ మియ్యకుండవలెనని" 1తిమోతి 5:14 లో వ్రాయబడియున్నది. స్త్రీ యొక్క సత్ ప్రవర్తనను బట్టి అసభ్యముగా నడుచుకొను పురుషుడు మార్చబడే అవకాశమున్నది. ఆమె వెలుపటి అలంకారమునకు ఎక్కువ ప్రాధాన్యవి వాయక సాధువైనట్టి, మృధువైనట్టి గుణములను తన హృదయపు అంతరంగ అలంకారముగ ధరించుకొనును అని 1 పేతురు 3 :1-6 లో చెప్పబడియున్నది. తన క్రైస్తవ భర్తకు ఆమె సాటియైన

పరిశుద్ధ సహాయముగా యుండి నిత్యజీవ కృపావనములో ఆమెపాలి భాగస్థురాలు కాగలదు.

క్రైస్తవ స్త్రీ యితర స్త్రీలకు ఉపదేశము చేయవచ్చును (తీతు 2 : 3-5). ఆమె తన బిడ్డలకు, ఇతరుల బిడ్డలకు ఉపదేశము చేయవచ్చును (2 తిమో 1 : 5; 3 : 14, 15). ఆమె సత్ క్రియలను జరిగించునట్టిదై యుండవచ్చును. తన భర్తతో కలసి క్రీస్తుయొక్క పనిలో సహచరిగా యుండవచ్చును. సంఘములోని పెద్దలు పరిచారకులు, బోధకులు ఉపదేశకులు మొదలగు వారికి ఆమెయొక్క విలువ వెండి బంగారముకంటె ఎంతో గొప్పది. క్రైస్తవ స్త్రీ సంఘములో పరోక్షముగ చేయగలపని, సహాయము ఎంతో యున్నది. స్థానిక సంఘము ఆరాధనకు కూడుకొను స్థలమును పరిశుభ్రముగా యుంచుటకు,ప్రభురాత్రి భోజనములోని అంశములను సిద్ధపరచి యుంచుటకు చిన్నపిల్లలకు వాక్యమును నేర్పుటకు. స్త్రీలకు ఉపదేశించుటకు, క్రైస్తవ గృహములను దర్శించి వారిని హెచ్చరించుటకు ఆమె పూనుకొనవచ్చును. మరల ఎవరైనా స్త్రీలు బాప్తిస్మము పొందుచున్నప్పుడు క్రొత్తగా చేర్చబడుచున్న సహోదరికి తగిన సహాయము ఆమె చేయవచ్చును. ఇట్టి పనులను ఎన్నిటినో ఆమె చేయుచు దేవుడు తనకిచ్చిన స్థానమును ఘనతనుబట్టి ఆమె దేవునికి మహిమ తీసికొని రాగలదు.

ఈ లోకములోయున్న ప్రతి ఒక్క స్త్రీ దేవునికి కృతజ్ఞత కలిగి క్రైస్తవరాలైయుండు బాధ్యతను కలిగియున్నది. బైబిలు ఎక్కడైతే బోధింపబడినదో క్రైస్తవ్యము ఎక్కడయితే వ్యాపించినదో అక్కడ స్త్రీయొక్క పరిస్థితి మెరుగుపరచబడెను. క్రీస్తును నమ్ముకొనినవారి మధ్య స్త్రీ ఒక వస్తువు కాదు. ఆమె ఒక బానిస వంటిదికాదు, మనుష్యుని కామ వాంఛలను సంతృప్తి పరచే సాధనముగా మాత్రమే ఆమె యుండదు. దేవుడిచ్చిన ఘనత గౌరవమును ఆమె పొందుచు క్రీస్తు రాజ్య వ్యాప్తికి ఆమె ఒక విలువైన సాధనమని గుర్తించబడును.

మనుష్యులను క్రీస్తుతట్టు తిప్పుటలో క్రైస్తవ స్త్రీ యొక్క ప్రభావము గొప్పది. యోహాను సువార్త 4వ అధ్యాయములో చెప్పబడిన సమరయ స్త్రీ యొక్క పేరు

మనకు తెలియదు. ఆమె క్రీస్తును కనుగొనుటయేగాక ఆమె వలన ఆఊరిలోని సమరయలలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి (యోహాను 4 : 39). మగ్దలేనే మరియలో నుండి యేసు యేడు అపవిత్రాత్మలను వెళ్ళగొట్టెను. ఆమె ఆయనయొక్క గొప్ప శిష్యురాలుగా తయారయ్యెను. ఆయన పునరుత్థానుడై మొట్టమొదట ఆమెకు కనబడెను (మార్కు 16 : 9). బేతనియలోయున్న మరియు మిక్కిలి విలుగల అత్తరును ఆయన తలమీదపోసి ఆయనను అభిషేకించెను. ఈమె తన శక్తి కొలది చేసి నా భూస్థాపన నిమిత్తము నాశరీరమును ముందుగా అభిషేకించెను అని యేసు అమెను కొనియాడెను (మార్కు 14 : 3-9). అపొ, కా 12వ అధ్యాయములో కనబడు మరియ ప్రభువు సేవకురాలు. ఆమె ప్రార్థన కూటములకు తన గృహపు తలుపులను సంతోషముతో తెరచెను. మార్కు వ్రాసిన సువార్త అనే పుస్తకమును వ్రాసిన మార్కు అను పేరుగల యోహానుయొక్క తల్లి ఆమె (అపొ.కా. 12 : 12) అకుల ప్రిస్కిల్ల అను దంపతులు కలసిచేసిన గొప్ప సేవనుగూర్చి మనము చదువగలము.

ఈ భార్యాభర్తల వలన అనేకులు రక్షణలోనికి వచ్చినట్లు మనము చదువగలము. తిమోతి అవ్వయైన లోయిలోను, తల్లియైన యునీ కేలోను నిష్కపటమైన విశ్వాసము వసించెను అని చెప్పబడియున్నది (2 తిమో 1 : 5) ప్రభువునందు యేర్పరచబడిన రూపునకు అతని తల్లికి రోమా16 : 13 లో వందనములని చెబుతు, పౌలు ఆమె నాకును (ఆత్మీయముగా) తల్లియని చెప్పెను. ఇంకను ఇట్టి ఉదాహరణలను భక్తి గల క్రైస్తవ స్త్రీలను గూర్చి మనము ఎన్నియో చెప్పుకొనవచ్చును.

యెహోవా దేవుడు స్త్రీకి ఒసగిన పాత్ర చాలగొప్పది ఇది ఘనమైనది విజయవంతమైనది. క్రైస్తవ గృహములో ఆమె చక్కటి భార్యగా, తల్లిగా యున్నయెడల ఆమె విశ్వాస ప్రభావములనుబట్టి తన బిడ్డలు, భర్త ప్రభువునందు మరింత నమ్మకస్తులుగా పనిచేయ వీలున్నది తద్వారా ఆమె సంఘమునకు బలమైన పరికరమువలె యుండును. నిజమైన క్రైస్తవ స్త్రీకి ఉన్న సంతోషము గొప్పది ఆమె ప్రభువు తనకిచ్చిన పనిలో నమ్మకముగా యుంటూ తనరక్షణను తాను

కొనసాగించుచు ఇతరులను రక్షించుటకు ఎల్లప్పుడు ప్రయత్నించుచునే యుండును.

నీవు ఇంకను క్రైస్తవ స్త్రీ కాకుండిన యెడల ఈ రోజే యేసు ప్రభువునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుము. రక్షణానందమును ఈ రోజే రుచిచూచి ప్రభువు కొరకు జీవించుము.

## సంఘము యొక్క అర్థము
## (Meaning of the Church)

బైబిలు ఒక సంఘము గూర్చి చెప్పుచున్నదని ఎవరు కాదనరు. అయితే ఎవరి సంఘము? ఏ సంఘము? ఈ ప్రశ్నలకును, మరికొన్నిటికిని రాబోవు పుటలలో జవాబీయబడును. గాని ఇప్పుడు, సంఘమనగా ఏమియో మనము తెలిసికొనగోరుచున్నాము. అయితే అది ఏమైయుండలేదో ముందు తెలిసికొనుట మంచిది. బైబిలునందు వర్ణించబడిన సంఘము కేథలిక్కులదిగాని, ప్రొటెస్టాంటులదిగాని, యూదులదిగాని కాదు. అది డినామినేషన్ కాదు. అంతర్డినామినేషనల్ అంతకుముందే కాదు. అది మతశాఖలదికాదు. అది రాజకీయ సంస్థగాని మరొక సాంఘిక సంస్థగాని కాదు. అది భౌతిక సంబంధమైన కూడిక గృహము (గుడు) కాదు. గనుక అది ఇవన్నియు కానట్లయితే, మరి ఏమైయున్నది? సంఘమును అనేకులు గ్రహించుకొనలేరు, ఏలయనగా అదేమిటో వారెరుగరు. అందువలన వారు దాని ప్రయోజనమును, ప్రాముఖ్యతను, పనిని గ్రాహ్యము చేసికొనలేరు. కాని అదేమైయున్నదో బైబిలు విపులముగ మనకు బోధించుచున్నది. సంఘము అను పదము "ఎక్లీషియా" అను గ్రీకుపదము నుండి ఉద్భవించినది. ఎక్లీషియా అనగా పిలువబడినవారు అని యర్థము. గనుక సంఘము పిలువబడిన సంస్థయై

యున్నది. ఈ లోకము నుండి దేవుని ప్రియకుమారుని రాజ్యములోనికి పిలువబడిన ప్రజలై యున్నది. (కొలస్స 1:13). అది క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరమై యున్నది (1 కొరింధి 12:27). అది క్రీస్తునకు విధేయులైన వారితో (హెబ్రీ 5:8,9) అనగా ఆయన ద్వారా రక్షింపబడి అందు చేర్చబడిన వారితో సమకూర్చబడినది (మార్కు 16:16, అపొ.కా.2:47). ఇంకొక మాటలో సంఘము క్రీస్తు యొక్క అనుచరులతో నింపబడినదై యున్నది.

సంఘము అను పదము బైబిలు నందు రెండు భావములతో కన్పడును మొదటిది, అది సార్వజనికము (Universal) అను భావము ఈ భావముతోనే క్రీస్తు పేతురుతో ఇట్లు పలికెను: " మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమునుకట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవు" (మత్తయి 16:18). సంఘము సార్వజనికమై యున్నదని చెప్పు అనేక వచనములున్నవి. అనగా ఈ లోకములో ఎక్కడయినను సంఘమున్న యెడల, అది బైబిలు సంఘమయిన యెడల, అది నేను కట్టుదునని యేసు చెప్పిన సంఘమై యుండును. రెండవది, అది స్థానికము(Local) అను భావము. ఉదాహరణకు, పౌలు రోమాలో యున్న సంఘమునకు వ్రాయునపుడు, అనేక స్థానిక సంఘము లను (Local Congregations) గూర్చి చెబుతూ "క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి'' యని పలికెను (రోమా 16:16). ఈ సంఘంము లన్నియును డినామినేషన్లు అను భావముతో గాక, అవన్నియు వేర్వేరు చోట్లనున్న స్థానిక క్రీస్తు సంఘములు అను భావమతో అతడు పలికెను. దీనిని ఇంకా వివరించవలెననిన, లేఖనముల కొరింధులో నున్న సంఘము అనియు, ఎఫెసులో నున్న సంఘ మనియు, ఫిలిప్పీలోనున్న సంఘమనియు పలుకుట నీవు గమనించగలవు (1 కొరింధి 1:2, ఎఫెసీ1:1; ఫిలిప్పీ 1:1). సంఘమును డినామినేషనల్ భావముతో చూచుటకు అలవాటుపడిన వారికిదంతయును గలిబిలిగా యుండును. మొదటి డినామినేషన్‌ను గూర్చి నీవు బైబిలు నందు చదువ లేవు. పై నుదహరించబడిన సందర్భములో అనేక

స్థానిక సంఘములను గూర్చి పలుకబడుట నీవు చూడగలవు. అవన్నియు కలసి సార్వజనిక సంఘ మగును. మనము డినామినేషన్లను మరచిపోయి, బైబిలునందు ప్రభువు ఇచ్చిన సంఘమును కనుగొనుట చాలా సులభము.

సంఘము యొక్క అర్ధమును ఇంకను మనము గ్రహించు నిమిత్తము సంఘమును బైబిలు ఈ క్రింది రీతిగ వర్ణించుచున్నది.

1. క్రీస్తు శరీరము : అది ఆయన ఆత్మీయ శరీరమై యున్నది. దానికి శిరస్సు క్రీస్తే (ఎఫెసీ5:23). ఒకే ఒక్క శరీరమున్నది (ఎఫెసీ 4:4). ఆ ఒక్క శరీరము ఒకే సంఘమై యున్నది (కొలస్స 1:18).

2. దేవుడి గృహము : లేఖనములలో గృహము అనుపదము కుటుంబమును సూచించుచున్నది, అనగా సంఘము దేవుని కుటుంబమై యున్నట్లు మనకు గ్రాహ్యమగుచున్నది. 1 తిమోతి 3:15లో దేవుని మందిరము లేక గృహము అనగా జీవము గల దేవుని సంఘము అని పౌలు పలికెను. దేవుడు తండ్రి మన మాయన కుమారులము (గలతి 3:26, 27; ఎఫెసీ 3:3).

3. దేవుని రాజ్యము:రాజ్యము ఒకే రాజును సూచించుచున్నది. గనుక క్రీస్తు రాజై యున్నాడు (ప్రకటన 17:14). అయితే రాజై యుండుటకు ఆయన ఇప్పుడు రాజ్యమును కలిగి యుండవలెను. దానిని ఆయన కలిగి యున్నాడు. (అపొ.కా. 8:12). మన మాయన సేవకులము, ఈ ప్రపంచము ఆయన పాలించు ప్రదేశము, క్రొత్త నిబంధన ఆయన చట్టము. ఇదీ సంఘము (మత్తయి16:18, 19).

4. దేవుని ద్రాక్షతోట : క్రీస్తు ద్రాక్షవల్లియై యుండగా వ్యక్తిగత క్రైస్తవులు తీగలై యున్నారు (యోహాను 15:1-8). దీనిని బట్టి మనము ఆయన తోటలో పనిచేసి ప్రభువు కొరకు ఫలములను ఫలించవలెనను భావము ఇందున్నది.

సంఘము ఈ విధముగ నిర్వచింపబడినది. లేఖనముల ననుసరించి ఈ సంగతులను దయచేసి చదివి నీకు నీవే పరిశీలించుము. ప్రభువు సంఘమును ఆయన కోరు రీతిగ నీవు గ్రహించుకొన గలిగిన యెడల, నీ తత్వమంతయు, బహుశ నీ జీవిత మంతయు మార్చబడగలదు.

# భక్తి గల పాపులు
## (*Religious Sinners*)

మానవులు యదార్థ స్వభావము గలవారై యుండి కూడ ఆత్మీయ విషయాల్లో అసత్యములో యుండుట సాధ్యమే. నిష్కపటులై యుండియు, పొరబాటులో యుండవచ్చునుప్రజలు భక్తి పరులై యుండవచ్చును,గాని పాపములోనే యుండవచ్చును ! గనుక భక్తి గలపాపులను గూర్చి ఇప్పుడు ఆలోచింతము.

మానవులు దేవుడు కాని దేవుని ఆరాధించునప్పుడు వారు భక్తిగల పాపులవుతారు. ఆరాధించుట వలన మానవులు భక్తిపరులవుతారు. అయితే కాని దేవుని నారాధించుట పాపము ! అహాబు రాజు ఇశ్రాయేలీయులను బయలు దేవతారాధన లోనికి నడిపించాడు (I రాజులు 18:17-40). ఏథెన్సు వారు "తెలియబడని దేవుని" నారాధించారు (అపొ.కా. 17:22-31). ఏథెన్సు పట్టణంలో ఎంతమంది జనులున్నారో అది అంతమంది దేవుళ్లతో నిండియుండెనట ! ఎఫెసీ పట్టణస్థులు అర్తెమి దేవిని పూజించేవారు (అపొ.కా. 19:27). కోట్లాది ప్రజలు నేడు వివిధ దేవుండ్లను దేవతలను పూజించుచున్నారు. ఈ 21వ శతాబ్దములో విగ్రహారాధన, దేవతార్చన విపరీతముగా ప్రబలుచున్నట్లు గమనించగలము.

కొందరు కాని దేవుండ్లను దేవతలను పూజించుచున్నట్లయితే మరికొందరు ధనాన్ని, ప్రఖ్యాతిని, బలాన్ని, సౌందర్యాన్ని, ఆహ్లాదాన్ని దేవునిగా పూజించుచున్నారు. ధనాపేక్ష లేక లోభత్వము విగ్రహారాధన యని పౌలు చెప్పెను (కొలస్స 3:5).

"అయితే యదార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది; తన్ను ఆరాధించువారు అట్టి వారు కావలెనని తండ్రి కోరుచున్నాడు. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెనని" యేసు ప్రభువు చెప్పెను (యోహాను 4:23-24).

"ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను" అని ఆయన అపవాదికి తెలియజెప్పెను (మత్తయి 4:10). "దేవునికే నమస్కారము చేయుము" లేక దేవునినే ఆరాధించుము అని దేవదూత యోహానుకు తెలియజెప్పెను (ప్రక 19:10). దేవుడు కాని దేవుని నారాధించుచున్న కోట్ల కొలది ప్రజలు భక్తిగలవారే గాని వారు భక్తిగల పాపులు !

రెండవదిగా, భక్తిగల పాపులు నిజదేవునినే ఆరాధిస్తారు గాని సత్యారాధన చేయరు. కయీను, హేబేలులు నిజదేవునినే ఆరాధించారు; గాని కయీను సరియైన విధంగా ఆరాధన చేయలేదు. అతడు పొలములోని పంటనే దేవునికి తెచ్చాడు. హేబెలు తనమందలో తొలుచూలున పుట్టిన వాటిని దేవునికి తెచ్చాడు (ఆది.కా.4:3-4). నాదాబు అబీహులు నిజదేవునినే ఆరాధించారు గాని పొరబాటుగా ఆరాధించారు. యెహోవా తమ కాజ్ఞాపింపని వేరొక అగ్నిని ఆయన సన్నిధికి తేగా యెహోవా సన్నిధి నుండి అగ్ని బయలుదేరి వారిని కాల్చివేసెను (లేవీకా 10:1-2). పరిసయ్యులు నిజదేవునినే ఆరాధించేవారు, గాని "మీ పారంపర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించుచున్నారు ?" అని యేసు వారినడిగెను (మత్తయి15:3). "ఈ ప్రజలు తమ పెదవులతో నన్ను ఘనపరచుదురు గాని వారి హృదయము నాకు దూరముగా నున్నది. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారునన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు" అని మన ప్రభువు చెప్పెను (మత్తయి15:7-9).

మనమెట్లు ఆరాధించినను భేదమేమియు ఉండదా ? తప్పక యుంటాదని యేసుయొక్క మాటల వలన మనకు జవాబు దొరకును. నేటి మానవుడు తనకు తోచిన విధంగా దేవుని ఆరాధించాలనుకొనుచున్నాడు. వాద్య సంగీతము నాకిష్టము అని అతడంటాడు. గాని మనం ఆరాధనలో పాటలు మాత్రమే పాడాలని దేవుడు చెబుతున్నారు (కొలస్స 3:16; ఎఫెసీ 5:19). సంవత్సరానికొకసారి ప్రభురాత్రి భోజనం ఆచరిస్తే చాలని మానవుడంటాడు. అయితే దాన్ని ప్రతి ఆదివారమున ఆచరించాలని ప్రభువు చెప్పుచున్నారు

(అపో.కా. 2:42; 20:7;I కొరింథీ 14:15). "ఆయన మాటలతో ఏమియు చేర్చకుము, ఆయన నిన్ను గద్దించునేమో, అప్పుడు నీవు అబద్ధికుడవగుదువు" అని సొలొమోను చెప్పెను (సామెతలు 30:6). లేఖనముల నతిక్రమింపరాదని పాత, క్రొత్త నిబంధనల కాలమంతటిలోను దేవుడు హెచ్చరించుచునే యుండెను (ద్వితీ 4:2; ప్రక 22:18-19;I కొరింథీ 4:6).

మూడవదిగా, భక్తిగల పాపులు రక్షింపబడకుండగానే నిజదేవుని నారాధిస్తారు. అపొస్తలుల కార్యములలో క్రైస్తవులుగా మార్పుజెందినవారందరు భక్తిగలవారు, నిష్కపటులు, యధార్ధవంతులు ఆసక్తిగలవారు, అయినను పాపులే ! భక్తిగా యుంటేనే సరిపోదు. ఆరాధిస్తే సరిపోదు. ఐతియొపీయ ఘనుడు ఆరాధించుటకు వెయ్యిమైళ్లు రథము మీద పయనించి వెళ్లెను.గాని ఫిలిప్పు అతనికి సువార్త భోధింపవలసి వచ్చెను. అతడు బాప్తిస్మము పొందినప్పుడు క్రైస్తవుడయ్యెను. అప్పుడతని ఆరాధన దేవునికి అంగీకార యోగ్యమైనదయ్యెను (అపో.కా. 8:26-39). కొర్నేలి చాల భక్తిపరుడు. అతడు తన యింటి వారందరితో కలసి దేవునికి భయపడువాడు. అతడు ప్రజలకు బహుధర్మము చేయుచు దేవునికి ఎల్లప్పుడు ప్రార్ధన చేయువాడు (అపో.కా. 10:1-2). అయినను పేతరు అతనికి సువార్త బోధింపవలసి వచ్చెను (అపో.కా. 11:14). అతడు క్రైస్తవునిగా మార్పు జెందినప్పుడు అతని ఆరాధన దేవునికి అంగీకారయోగ్యమైనదాయెను (అపో.కా. 10,11 అధ్యా). లూదియ నిజదేవుని నారాధించు భక్తురాలే. అయితే పౌలు సువార్త ప్రకటించగా ఆమె కూడ సువార్తకు లోబడి బాప్తిస్మము పొందెను (అపో.కా. 16:14-15). అప్పుడు మాత్రమే ఆమె యొక్క ఆరాధన దేవునికి అంగీకార యోగ్యమైనదాయెను. పాపులయొక్క ఆరాధనను దేవుడు అంగీకరించలేదు, అంగీకరించడు.

చివరిగా క్రైస్తవులు నిజదేవునినే ఆరాధించవచ్చును గాని వారి జీవితములు సరిగ్గా ఉండక పోవచ్చును. అందువలన వారు కూడ భక్తి గల పాపులే. అననీయ సప్పీరా అను

దంపతులు ధనాపేక్షగలవారు, అబద్ధికులు (అపొ.కా. 5:1-11). దేమా అనునతడు యీ లోకమును ప్రేమించి పౌలును, ప్రభువును విడిచి వెళ్లిపోయాడు (2 తిమో 4:10) ఇదివరకు గారడీ వాడైన సీమోను క్రైస్తవుడై దేవుని శక్తిని డబ్బుతో కొనజూచాడు. అతని పాపములు క్షమింపబడునట్లు అతడు మారుమనస్సు పొంది ప్రభువును వేడుకొనవలెనని చెప్పబడెను (అపొ.కా. 8:18-24). క్రైస్తవులై సరియైన జీవితాన్ని జీవించని వారి ఉదాహరణలు యివి కొన్ని మాత్రమే. ఈలోకములో క్రైస్తవులు స్వస్థబుద్ధిలోను నీతితోను భక్తితోను బ్రతుకుచుండవలెను (తీతు 2:13). క్రైస్తవులు ఈలోకానికి ఉప్పువంటివారు, వెలుగువంటివారు (మత్తయి 5:13-16) మనుష్యులందరు తెలినికొనుచ చదువుకొనుచున్న సజీవ పత్రిక వంటివారు క్రైస్తవులు (2 కొరింథీ 3:2) క్రైస్తవులు ప్రతివిధమైన కీడు నుం దూరముగా యుండాలి (I థెస్స 5:22) వారు ఆత్మకు విరోధముగా పోరాడ శరీరాశలను విసర్జించాలి (I పేతుర 2:11).

మనం సర్వసృష్టికి సువార్త ప్రకటించాలి (మార్కు 16:15-16) దేవుని ఆత్మతోను సత్యముతోన ఆరాధించాలి (యోహాను 4:23-24) మనం దేవుని పూర్ణ మనస్సుతోను హృదయముతోను, ఆత్మతోన ప్రేమించాలి (మార్కు 12:30-31)

**క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' టి.వి.**
**కార్యక్రమములను ప్రతి మంగళవారం ఉదయం 6:30 గం॥లకు**
**మా టి.వి. లోను మరియు ప్రతి శనివారం ఉదయం 6:30 గం॥లకు**
**తేజ ఛానల్ లోను చూడండి.**

# ఇదిగో ఈ మనుష్యుడు
# (Behold the Man)

పిలాతుకు అధికారం అప్పగింపబడింది. ఆ సమయానికతఆ స్థలంలో ఉన్నాడు. అతడు యూదుల వల్ల పదే పదే ఒత్తిడి చేయబడ్డాడు. ఇపుడు తిరుగుబాటదారుడు, హంతకుడనైన బరబ్బాను విడుదల చేసి ఎవనియందు ఏ దోషము కానరాలేదో ఆవ్యక్తిని చంపుటకు ఒత్తిడి చేస్తున్నారు. ఆతని సంశయం? శాంతిని కాపాడడం తన కర్తవ్యం. న్యాయము తెలుపుటకు నియమింపబడ్డాడు. నిర్దోషియైన వ్యక్తిని ఉరికి పంపడమంటే హత్యా నేరంలో తాను కూడా భాగస్థుడే గాని శాంతి ఏర్పడకపోతే రోమ్ యొక్క ఆగ్రహాన్ని ఎదుర్కోనాలనే వయసు అతనికి లేదు. ప్రస్తుత స్థితిలో యేసు ప్రభువు నేరస్థుడవుటే సరియైన రాజకీయ చర్యగా ఆతడు గ్రహించాడు. గాని మరణమునకు తగిన హేతువేమి ఈ మనుష్యునిలో లేదని ప్రకటించుటకు పరిస్థితులతనిని బలవంత పెట్టాయి. అవి పరిస్థితులను చక్కబెట్టవలసిందిగాని అలా జరగలేదు. పిలాతు యేసు ప్రభువుని గూర్చి "ఆతడు దోషికాడు'' అన్నాడు. గాని సంశయించాడు.

యేసు ప్రభువును చంపడం కోసం కేకలు వేస్తున్న వారి మనసులు పిలాతు మార్చలేడు. తన మూఢ నమ్మకాన్ని బట్టి వారి ఒత్తిడికి తలవొగ్గకుండానే యేసు ప్రభువును కొరడాలతో కొట్టుటకు అప్పగించాడు. కొరడాలతో కొట్టడం కౄరమైన, ప్రాణాంతకమైన కఠిన శిక్ష. నిందుతుని బాధకు గురిచేసే ప్రధాన చర్య. పిలాతు ఆజ్ఞాపించగా సైనికులు ఇట్టి చట్టపరమైన హింస ప్రారంభించారు. తరువాత వారు ఒక ముండ్ల కిరీటమును అల్లి యేసు ప్రభువు తలపై పెట్టారు. అదనంగా వారు ఆయనకు ఊదారంగు వస్త్రం ధరింపచేసారు (యోహాను 19 :2).

గ్రంధాలను బట్టి చూస్తే యేసు ప్రభువు సైనికుల చేతిలో కొట్టబడటం ఇది రెండవ పర్యాయం - మొదటిసారి హేరోదు యొక్క ఆజ్ఞప్రకారం జరిగింది. తరువాత పిలాతు యేసు ప్రభుని వెలుపలికి తీసికొని వచ్చాడు. యేసు ప్రభువును నిందించుచున్న వారు,

పిలాతుకు ఆయనయందు ఏ దోషము కనబడలేదని తెలిసికొనునట్లు అలా చేసాడు (యోహాను 19:3).

తరువాత పిలాతునుండి ఒక గంభీరమైన అసాధారణమైన వివరణ వచ్చింది. ఈ వివరణలో అనేక విషయాలు కనుగొనవచ్చు. ఉదాహరణకు - పిలాతు, ఎవరిని నిర్దోషి అని ఎంచాడో అయేసు ప్రభువు జాలికి నిదర్శనం. స్వభావంలో ఆయన నిర్దోషి గాని ఆయన స్థానం విషాదం, విచారం. అయినప్పటికి యేసు ప్రభువుపై ఆతనికున్న జాలిలో తిరస్కారం కూడా ఉంది. తనను రాజుగా చెప్పుకొనుచున్న, సత్యమును గూర్చి సాక్షమిచ్చు చున్నానంటున్న ఈ మనుష్యుడు కొట్టబడి, గొలుసులతో కట్టబడి నిలువబడి ఉన్నాడుగాని లొంగుట లేదు. పిలాతు బయట పడడానికి యేసు ప్రభువు అవకాశం ఈయలేదు. యూదులు ఇయ్యలేదు. గనుక యేసు ప్రభువు ఇచ్చిన సమాధానాలకు ఆందోళన చెందడే మాత్రమేగాకుండా, పిలాతు వివరణలో నిర్దోషియైన ఈ వ్యక్తిని నిందించుచున్నవారికి తన విసుగుతో కూడిన సలహా ఉంది. పిలాతువారి ఉద్దేశ్యాలు చదవగలడు, యేసు ప్రభువు యెడల వారికున్న ద్వేషాన్ని తృణీకరించాడు. "ఈ మనుష్యుని వైపు చూడుడి"...... కొంత మానవత్వముతో సానుభూతితో ఆతనివైపు చూడమంటున్నాడు గాని నిందించేవారు యేసు ప్రభువు యొక్క బాధవల్లగాని శ్రమ వల్లగాని స్పందించలేదు. వారికి ఈ వ్యక్తి పట్ల జాలికలుగలేదు, లేదా ఆతని దయనీయ స్థితిని లక్ష్యం చేయలేదు. నిర్దోషత్వం, సద్గుణం మంచితనం వ్యక్తిలోని హుందాతనం అనే ఆలోచనలనే వారు రానియ్యలేదు. వారి విద్వేషపు, అక్రమ చర్యల పర్యవసానం గురించిన తలంపులను రానీయలేదు. వారు తృణీకరించేబాధితుని పట్ల వారికి ఎట్టి కనికరము లేదు.

-రాన్‌బ్రాయన్ట్

**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

**SATYA VANI, P.O.BOX-80, KAKINADA -533 001.**

# సంక్షిప్త వార్తలు

2006 మార్చి 13న రామచంద్రపురంలో సహోదరులు యన్. ప్రసాద్ గారి యొద్ద యౌవనస్థుల కూటం జరిగినది. దీనిలో పలు ప్రాంతముల నుండి వచ్చిన యౌవనస్థులు పాల్గొనిరి. సహోదరులు జాన్ లక్కీ గూటం గారు యౌవనస్థులను హెచ్చరిస్తూ ప్రసంగించిరి.

మార్చి 12, 13,14 న విసావరంలో సహోదరులు Ch. సుగుణరావు గారిచే నిర్వహించబడిన కూటంలో సహోదరులు వుందుర్తి రాజా విజయ్ కుమార్ గారు రాజమండ్రి , జి. మామిడాడ నుండి వాచ్చిన గాంధీ గారు, ఇంద్రపాలెం నుండి వచ్చిన జాన్ మోజెస్ గారు, మరియు సహోదరులు జాన్ లక్కీ గూటం గారు, వారి సతీమణి సుదీప గూటం గారు ఈ కూటంలో పాల్గొని వాక్య పరిచర్య చేసిరి.

మార్చి 17,2006న దేవగుప్తంలో సహోదరులు ఏలియా గారిచే నిర్వహించబడిన కూటంలో అమెరికా నుండి వచ్చిన సహోదరులు రోజర్ రైట్ గారు మాట్లాడిరి. సహోదరులు జాషువా గూటం గారు, కబితా గూటం గారు మరియు మేరీ రైట్ గారు పాల్గొనిరి. 7గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి.

మార్చి 18, 2006న సహోదరులు శీమంత రాజు గారు కాండ్రకోటలో కూటం నిర్వహించిరి. దీనిలో సహోదరులు రోజర్ రైట్ గారు ప్రసంగించగా సహోదరులు జాన్ లక్కీ గూటం గారు తర్జుమా చేసిరి. దీనిలో సహోదరి మేరీ రైట్ గారు కూడ పాల్గొనిరి.

మార్చి 19వ తేదీ ఆదివారం ఉదయం సోదరులు జాషువా గూటం గారు రక్తపోటు సంబంధించిన తీవ్రత వలన కాకినాడ అపొల్లో ఆసుపత్రి నందు చేర్చబడి చికిత్స పొందుచు ఆరోగ్యము కోలుకొనుచున్నారు. ఆయన 28వ తేదీ నాడు ఆసుపత్రి నుండి స్వగృహమునకు చేరుకొన్నారు. ఆయన ఆరోగ్య విషయమై ప్రార్ధించిన సోదర సోదరీలకు, సంఘాలకు నాయకులకు బంధు మిత్రులకు మా వందనములు. ముఖ్యముగా దేవునికి స్తోత్రములు. జాషువా గారి సంపూర్ణ ఆరోగ్యం కొరకు ప్రార్ధించుచు యుండవలెనని మా విజ్ఞాపన.

## బైబిల్ యొక్క సత్యాలు

దేవుని పరిశుద్ధ గ్రంథమును (బైబిల్‌ను) 1600 సంవత్సరముల కాలములో 40 మందికి పైగా రచించిరి.

బైబిల్‌లో రెండు భాగములు కలవు. (1) పాత నిబంధన (2) క్రొత్త నిబంధన పాత నిబంధన పుస్తకాల సంఖ్య 39. క్రొత్త నిబంధన పుస్తకముల సంఖ్య 27 మొత్తము 66 పుస్తకములు బైబిల్‌లో కలవు.

బైబిల్‌లో మధ్య అధ్యాయం - కీర్తనలు 117 ( ఇది బైబిల్‌లో అతి చిన్న అధ్యాయము)

బైబిల్‌లో మధ్య వచనం - కీర్తనలు 118:8

బైబిల్‌లో అతి పెద్ద వచనం - ఎస్తేరు 8:9

బైబిల్ అతి పెద్ద పదము - యెషయా 8:1 (మహేరు షాలాల్ హాష్ బజ్)

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 0